క్లుప్తంగా

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

కేవీపల్లె : మండలంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవోలు పి. రెడ్డి బాషా, డి. సుబ్రమణ్యం తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్ నందు 190 మంది, కేవీపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో 160 మంది, గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల నందు 180 మంది మొత్తం 530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మంచినీటి సౌకర్యం, ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్స్, వైద్య సౌకర్యం సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు.

ఎన్నికల కోడ్ పట్టిష్టంగా అమలు చేయాలి

నిమ్మనపల్లె : ఎన్నికల నియమావళి పట్టిష్టంగా అమలు చేయాలని తహసీల్దార్ బాలాజీ రాజు అన్నారు. శనివారం కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో, స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో, మండల స్థాయి అధికారులు బిఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు కోడ్ అమల్లో ఉన్నందున, ప్రజలందరూ తప్పనిసరిగా ఎన్నికల నియమాల్ని అనుసరించాలన్నారు. రోడ్ల పైన వ్యాపార సముదాయం భవనాలపై ఉన్న బ్యానర్లను వెంటనే తీసివేయాలని ఆదేశించారు. రాజకీయ నాయకుల ఫోటోలకు ముసుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాలేట్, ఏవో రమేష్, ఎంఈఓ నారాయణ, డీటీ తపస్విని, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం జగనన్న లేఅవుట్‌లో స్థలాలు కేటాయించింది. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా 46 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీపీ మహమూద్,స్థానిక సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు.

22న మల్లారమ్మ జాతర

మదనపల్లె సిటీ : మేదర కులస్తులు ఆధ్వర్యంలో మల్లారమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుబ్రమణ్యం తెలిపారు. 22న పేరంటాల పూజ, 23న గంప పూజ, 224న వసంతం జరుగుతుందన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని జవుకుపల్లి వద్ద జరిగే జాతరకు మేదర కులస్థులు పాల్గొన్నాలని కోరారు.

వ్యాధుల నుంచి రక్షణకు వ్యాక్సిన్ తప్పనిసరి

వాల్మీకిపురం : మానవ జీవితంలో వచ్చే నివారించే వ్యాధుల నుండి రక్షణ పొందడానికి ప్రభావవంతమైన, సురక్షితమైన వ్యాక్సిన్స్ అవసరం అని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యులు శ్రీవిద్య అన్నారు. శనివారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి వ్యాక్సిన్ వేయించాలని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వేస్తున్నారని తెలిపారు. క్షయ, కామెర్లు, కోరింత దగ్గు, కంటిచూపు లోపాల నివారణ, ధనుర్వాతం వంటి అంటు వ్యాధులను వ్యాక్సిన్‌తో నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సనా అయేషా, సిబ్బంది మహమ్మద్ రఫీ, సుధాకర్, మౌనిక, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిట్టిబాబు

రామసముద్రం : రామసముద్రం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎ.చిట్టిబాబు శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మురళీధర్ పదోన్నతిపై వెళ్లడంతో పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తూ పదోన్నతిపై రామసముద్రం ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఆయనకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తానన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

మదనపల్లె సిటీ : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ -1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని అన్ని బస్సులు సమయపాలన ప్రకారం నడపాలని ఆదేశించారు.

నాటుసారా ఊట ధ్వంసం

పెద్దమండ్యం : మండలంలోని రామానాయక్ తండా పంచాయతీ బండకిందతండా, రామానాయక్‌తండాలలో శనివారం నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ టి. మధుల ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ దళాలతో రామానాయక్‌తండా, బండకిందతండాలలో నాకాబందీ నిర్వహించినట్లు తెలిపారు. తండాలకు సమీపంలోని కొత్తచెరువులో నాటుసారా తయారీకి ఉపయోగించే ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీలో మైనారిటీలకు సముచిత స్థానం

- మదనపల్లె సీటు కేటాయింపుపై ముస్లింల హర్షం
- షాజహాన్‌బాషా నోరు అదుపులో పెట్టుకోవాలి
- బీజేపీని తిట్టిన నోటితో నేడు పొగడ్తలా..?
- దమ్ముంటే మోదీ ఫొటో, బీజేపీ జెండా పెట్టుకుని ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్, మైనారిటీ నాయకులు

మదనపల్లె : ముస్లింల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటుగా, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వారి అభివృద్ధికి బాటలు వేస్తూ సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీనేనని మదనపల్లె వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మదనపల్లె అభ్యర్థిగా మైనారిటీ వర్గానికి చెందిన నిసార్‌అహ్మద్ పేరును ప్రకటించడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ ముస్లింలపై తమకున్న అభిమానాన్ని చాటుకునేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి రెండోసారి మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికే మదనపల్లె సీటు కేటాయించారన్నారు. దీనికి ముస్లిం సమాజం మొత్తం వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటుందన్నారు. మదనపల్లెలో ముస్లింలు అంటే కేవలం సలామత్ కుటుంబమేనని, వారు తప్ప మిగిలిన వారు రాజకీయాల్లోకి రాకూడదని రౌడీయిజం, రుబాబులు ప్రదర్శించడం తగదన్నారు. వక్ఫ్‌బోర్డు భూములు కాపాడేశానని ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్న షాజహాన్‌బాషా, వాటిపేరుతో చేసిన అక్రమవసూళ్లు, దోపిడీలపై నోరు విప్పాలన్నారు. అధికారం కోసం మత, కులతత్వపార్టీలతో చేరి, పోటీకి రావడం భావ్యం కాదన్నారు. గతంలో సీఏఏ, ఎన్ఆర్‌సీ పోరాటంలో బీజేపీని తిట్టిపోసిన నోటితోనే, నేడు బీజేపీతో మంచి జరుగుతుందని ఎలా చెపుతున్నారని ప్రశ్నించారు. షాజహాన్‌బాషా పొత్తుధర్మాన్ని పాటించేవాడైతే... బీజేపీ మోదీ ఫోటో తన బ్యానర్లలో, మెడలో బీజేపీ కండువా వేసుకుని ప్రచారం చేయాలన్నారు. స్వార్థం కోసం నీచపూరితమైన రాజకీయాలు చేయవద్దని, రాజకీయభిక్ష పెట్టిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే పుట్టగతులుండవనే విషయం తెలుసుకోవాలన్నారు. మైనారిటీ నాయకులు ముబషీర్ మాట్లాడుతూ సలామత్ ఫ్యామిలీ చరిత్ర మొత్తం అవినీతి, రాసలీలలు, అధికారులను బలిపశువులు చేయడం తప్ప ప్రజలకు చేసిన మేలు లేదన్నారు. లియాఖత్‌అలీ మాట్లాడుతూ మైనారిటీ వర్గానికి చెందిన షాజహాన్‌బాషా...టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో నిలవడం దురదృష్టకరమన్నారు. మైనారిటీ నాయకులు ఫర్హానాఆఫీ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ .షాజహాన్ జిమ్మిక్కులకు చంద్రబాబు మోసపోయినా, మదనపల్లె నియోజకవర్గ ప్రజలు మోసపోరన్నారు. అన్నదమ్ముల చరిత్ర మదనపల్లె వీధుల్లో ఎవ్వరిని అడిగినా కథలు, కథలుగా చెపుతారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ప్రసాద్‌బాబు, ఈశ్వర్ నాయక్, నాయకులు బావాజాన్, రాయల్‌రవీంద్ర, మునిశేఖర్, ఎల్ఐసీ.సుధాకర్, చిప్పిలి జగన్నాథరెడ్డి, ఆంజనేయులు, పసుపురవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన

సీఎం వైఎస్.జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని, కుల, మత,పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 18,19,20 వార్డులకు సంబంధించిన లబ్దిదారులకు ఇళ్లపట్టాలు, ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌అజంలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, వినుతాభాయి, ఈశ్వర్‌నాయక్, రేణుక, పాల్‌చంద్రశేఖర్, రాజేష్, ప్రసాద్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, బావాజీ, ఆంజనేయులు, పసుపురవి, ఎల్ఐసీ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు

ఆర్డీఓ హరిప్రసాద్



ఎన్నికల అధికారులతో సమావేశమైన ఆర్డీఓ

మదనపల్లె : ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని మదనపల్లె నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం భారత ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఆయన వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా క్షేత్రస్థాయిలో అమలుచేయాలని, 24,48,72 గంటలలో నిబంధనల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, అడ్వర్టయిజ్‌మెంట్, కటౌట్స్ తొలగించాలని ఆదేశించారు. 1950 ద్వారా, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. ఎంసీసీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రాజకీయపార్టీలకు, నాయకులకు దూరంగా ఉండాలన్నారు. అధికారులు జాగ్రత్తగా ఉండాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నిమండలాల్లో ఎన్నికల కోడ్‌ను అమలుచేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమాహాళ్లు, ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ, కల్యాణమండపాల యజమానులు పని చేయాలన్నారు. కచ్చితంగా బిల్లులు ఇవ్వడమే కాకుండా, వారి పేర్లను రికార్డుల్లో నమోదుచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్‌లు రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, ఎంపీడీఓలు భానుప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలి

– జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి

కలకడ : రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు గృహసారథులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ రావుల నరసింహారెడ్డి సూచించారు. శనివారం మండలంలో మేము సిద్ధం -మా బూతు సిద్ధం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల వరకూ ఇంటింట ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రాజ్, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యురాలు హారిక, సర్పంచ్ మంజుల, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, మండలప్రత్యేక ఆహ్వానితులు జీవికిషోర్, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, హరినాథనాయుడు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరురూరల్ : పీలేరు పట్టణం తిరుపతికి రోడ్డు, బండ్లవంక, ఆర్టీసీ నల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. శనివారం పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అందరికీ వైఎస్సార్ సీపీ కండువాలతో పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాబు, తిరుపతయ్య, వెంకటరమణ, రామాంజులు, చంద్ర, మల్‌రెడ్డి, చంద్రారెడ్డి, సాగర్, రమణమూర్తి, ప్రతాప్‌రెడ్డి, మల్‌రెడ్డి, జయరాం, జయరామిరెడ్డి, సుశీల ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సతీష్‌రెడ్డి, దినకర్‌రెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, మనోదయరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, చక్రధర్, చైతన్యరెడ్డి, కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కలికిరి : రాజంపేట పార్లమెంటు, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్ ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరోసారి విజయం చారిత్రాత్మక అవసరమని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగి, పేదలకు మరింత మంచి జరగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని, తనను ప్రజలు మరోసారి గెలిపించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ పద్మజ, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, అరుణబాబురెడ్డి, నాగవేణినాగేంద్ర, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, సావిత్రి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, షాహీనాఇనాముల్లా, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టు అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి

తంబళ్లపల్లె : మల్లయ్యకొండ శ్రీమల్లికార్జునస్వామి సేవాసమితి (అన్నదాన ట్రస్టు)అధ్యక్షుడిగా గెరిగి రాజశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాతకళాశాల వద్ద అన్నదాన కమిటీ సమావేశం జరిగింది. మహాశివరాత్రి పర్వదినాన కొండకు వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాట్లు, భక్తుల నుండి వచ్చిన విరాళాలు, వస్తు, సామగ్రి ద్వారా వచ్చిన ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలపై గత అధ్యక్షులు రమణారెడ్డి సమక్షంలో చర్చించారు. భక్తుల నుంచి విరాళాలు, వస్తు సామగ్రి ద్వారా రూ.13,81,960లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అన్నసంతర్పణకు రూ.13,70,544లు ఖర్చు జరిగినట్లు తేల్చారు. మిగిలిన రూ.11,416లను అన్నదాన కమిటీ బ్యాంకుఖాతాకు జమచేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యుల గడువు ముగియడంతో నూతన కమిటీ ఎన్నికకు తీర్మానం చేసి ఆమోదించారు. కమిటీ నూతన అధ్యక్షులుగా రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి, మరో 10 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నెరవేరిన గుర్రంకొండ ప్రజల ఆకాంక్ష



గుర్రంకొండలో ఆర్టీసీ బస్టాండును ప్రారంభిస్తున్న ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి తదితరులు

గుర్రంకొండ : గుర్రంకొండ ప్రజల ఆకాంక్ష, కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన గుర్రంకొండ ఇందిరమ్మ కాలనీ వద్ద రూ.45 లక్షలతో నిర్మించిన నూతన ఆర్టీసీ బస్టాండును ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఏ ప్రభుత్వం చేయలేని పని సీఎం జగన్మోహన్ రెడ్డి హయంలో జరిగిందన్నారు. గుర్రంకొండ పట్టణ వాసుల కల నెరవేరిందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సహకారంతో ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు కావడం హర్షణీయమన్నారు. ప్రతిపక్షాలు ఇప్పటికైనా విమర్శలు మాని అభివృద్ధిని కళ్లారా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, ఎంపీపీ సీతమ్మ, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, మాజీ ఎంపీపీ జమీర్, ఎంపీటీసీ రాజగోపాల్, కాదిర్, సింగిల్‌విండో డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, నక్కానాగరాజ, మార్కెట్‌కమిటిడైరెక్టర్లు గణేష్, శ్రీనివాసులు, రమేష్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

పీలేరు : అభివృద్ధి ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి అన్నారు. శనివారం పీలేరు పట్టణం బాపూజీ నగర్, మోడల్ కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి రెండో సారి ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ నరసింహారెడ్డి, వార్డు మెంబరు సాంబశివారెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, రెడ్డిబాషా, అభిషేక్, హుమయూన్, చక్రదర్, విజయశేఖర్‌రెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

బి.కొత్తకోట : ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ రావుల నరసింహారెడ్డి అన్నారు. శనివారం బి.కొత్తకోటలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమానికి జేసీఎస్, బూత్ కమిటీ కన్వీనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో కమిటీల పాత్ర కీలకమని, ఈ నెలరోజులు శ్రమించి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధికంగా మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమానికి ముందు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, జడ్పీటిసి రామచంద్రయాదవ్, బిల్డింగ్ సొసైటీ చైర్మన్ బలరాం రెడ్డి , వైస్ ఎంపీపీ ఖాదర్ వలి, మండల జేసియస్ కన్వీనర్ రెడ్డిహరి, పట్టణ కన్వీనర్ చిన్నికృష్ణ , పట్టణ జేసియస్ కన్వీనర్ మోహన్ బాబు, జాబీర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో తారు రోడ్డు మంజూరు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో ఇటీవల గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నిర్వహించారు. ఈ నేపథ్యంలో టి.సదుం మెయిన్ రోడ్డు నుంచి తమ గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని బొమ్మిరెడ్డిపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యపై స్పందించిన ఆయన తారు రోడ్డు మంజూరు చేయించగా శనివారం సదరు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ శివాల లోకేష్, ఎంపీటీసీ రవి తెలిపారు.

ఆర్‌బీకే సేవలు ఉపయోగించుకోవాలి

కలకడ : ఆర్‌బీకే సేవలను రైతులు ఉపయోగించుకోవాలని సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మండల ఆర్‌బికె అధ్యక్షుడు హరినాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోన సచివాలయం పరిధిలోని కోన ఆర్‌బికె కేంద్రాన్ని ప్రభుత్వం రూ. 21.80 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించి ప్రసంగించారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులు ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండలప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పంచాయతీకారదర్శి మునిరాజ, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఆర్‌బికె ఇన్‌చార్జ్ అక్రంబాషా పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

మదనపల్లె సిటీ : పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాసవీ క్లబ్ సెక్రటరీ అమరనాథ్, కోశాధికారి లక్ష్మి దీపక్ , ఉపాధ్యక్షులు క్రిష్టారావు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని ఎన్నటికీ మరువలేమని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు 123వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు మునిరాజ, దామోదరం, యశోద, రమాదేవి, లలిత కుమారి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

బి.కొత్తకోట : అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని స్థానిక ఎంఈఓ రెడ్డి శేఖర్, మండల పరిషత్ ఏవో థామస్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక మండలప్రజాపరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వైభవంగా ధ్వజారోహణం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి ధ్వజారోహణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన శనివారం ఉదయాన్నే మూలవర్లకు స్నపన తిరుమంజనం కావించారు. తోమాలసేవ, ఏకాంత సేవలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భేరితాండవం నిర్వహించి దేవతాహ్వానం కావించారు. ఈసందర్భంగా గరుఖ్మంతునికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు.

లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం

మదనపల్లె : మదనపల్లె కోర్టు భవన సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 112 కేసులు పరిష్కారం అయ్యాయి. జిల్లా సెషన్స్ కోర్టు రెండవ అదనపు ఇన్చార్జ్ న్యాయమూర్తి శాంతి సమక్షంలో లోకదాలత్ కార్యక్రమం జరిగింది.ఇందులో భాగంగా రాజీ మార్గంలో 16 సివిల్ కేసులు, 96 క్రిమినల్ కేసులు పరిష్కరించుకున్నారు. కేసుల పరిష్కారంలో భాగంగా బాధితులకు రూ.70.5 లక్షల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శిరీష్, చలపతిరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 38 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా 8వ అదనపు జడ్జి సుంకర శ్రీదేవి తెలిపారు. మొదటి బేం మోటారు వాహన కేసులు 8, ఇతర కేసులు 30 పరిష్కారం అయినట్లు తెలిపారు. వివిధ కేసులకు సంబంధించి కక్షిదారులను రాజీ కుదర్చి మొత్తం 38 కేసులు పరిష్కరించి రూ. 45,25,311 రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. రవి, న్యాయవాదులు తెనాలి రామసుబ్రమణ్యం, పి.వి. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం మండల న్యాయసేవ సంఘం అధ్యక్షులు, ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. కక్షిదారులు ఇరువర్గాల సమ్మతి మేరకు నాలుగు కేసులను పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.1.70లక్షల ప్రాపర్టీని రికవరీ చేశారు.